మండిపోయింది. మేవు అపోలో థర్టీన్ గురించి మాట్లాడుకుంటున్నావండీ అన్నాను నేను. మాట్లాడుకోండి, మాట్లాడుకోండి ఆ పక్కవారిల్లు ఇదే ననుకుని తలుపు తట్టాను. అమ్మడూ తలుపేసుకో అని బెండయ్యగారు వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. మేంకూడా ఇహ్హిహీ అంటూ నవ్వుకున్నాం మీరు కూడా ఇహ్హిహీ అంటూ నవ్వండి. నవ్వడం చేతగాకపోతే నోరు మూసుకోండి, దట్సాల్!

# గోవిందుడొస్తాడు

పిచ్చాసుపత్రిలో ఒక వాటా అద్దెకు తీసుకుని కాపురం పెడ్తే ఎలాగుంటుందో అలా వుంటుంది మా ఇల్లు హమేషా తమాషాగా. మొన్నీ మధ్య నోరోజు మావారొచ్చి తన సహజ గంభీర పరధ్యానంలో "గోవిందు డొస్తాడే" అన్నారు. "ఎవడే" అన్నాను. నన్ను కూడా "ఒసే-గిసే" అంటావా అని పరమ యాంగ్రీగా చూశారు.

"అంటే అంటాను తప్పేముంది" అన్నాను తాగితే తప్పేముంది అని పాడినట్లు. అఫ్‌కోర్స్ తాగేది కాఫీ, టీలే ననుకోండి. మీరట్లాచూస్తే మాడి మసైపోవటానికేం కొంగను కొక్కిరాయినూ కాను, "ఎవడే" అని ఎందుకన్నావ్ అంటూ ఓ గుద్దు గుద్దేరుబల్లమీద "మీరు కూడా ఓ ఐదుగజాల శారీచుట్టుకొనొచ్చినాపక్కన కూర్చోండి కత్తిపీటమీద. ఇద్దరం కలిసి పిండి రుబ్బుకోవచ్చు. ఇంచక్కా కూరలబుట్ట ముందేసుకుని అరిటి కాయల్సుకు చెక్కుతీసుకోవచ్చు. అవటాని చెరోచేటాముందేసుకుని బియ్యం ఏరుకోవచ్చు మరిన్ని ఒడియాలు పెట్టుకోవచ్చు. ఆడదానికి ఆడసహాయం అన్నట్లు – " ఇంకా నానోట్లో వాగుడునోట్లో వుండగానే "ఆపు" అని గర్జించారు. ఆ గర్జింపుకి గోడనున్న పటాలు వూగిస లాడాయి. అద్దంముందు పవుడరుడబ్బా మూతథామ్మని క్రిందపడింది. కొబ్బరినూనె సీసాలో కొబ్బరినూనె గజగజా వణికింది. నేను మాత్రం చెక్కు చెదర్లేదు. "చెప్పండి" అన్నాను. ఈలోగా మా ఉమ్మడివాటాలో తిరిగే కుక్క ఓ మాటు తలకాయ లోపలికి పెట్టిచూసి "మనకెందుకులే" అన్నట్లు చూసీచూడనట్లు తోకాడించుకుంటూ వెళ్ళిపోయింది. మీది వెంటిలేటర్లోని పిచికలు మా దెబ్బలాట ఏ స్థాయికి దిగుతుందోనని ప్రత్యేక విలేకర్లులా పొంచి పొంచి చూస్తున్నాయి.

"బెకెట్ చదవలేదా" అన్నారు.

"ఓహోమీకు బక్కెట్ కావాలా? ఆమాట చెప్పరేం – దానికింత రాద్ధాంతం ఎందుకు. బక్కెట్లో తడిసిన బట్టలున్నాయి. అవి తీసి మీకిస్తాను." అన్నాను. మళ్ళీ గర్జించారు. ఇవేం గర్జింపులమ్మా దిక్కుమాలిన గొడవొచ్చి పడి పోయింది? బక్కెట్‌మీద పట్టించారివ్వాళ.

"మీకు చికాగ్గావుంటె తలుపులు మూసుకుని అఘోరించండి. అంతేకాని యిలా అయిన

దానికీ కాని దానికీ నన్ను వేపుకుతింటే నేను పడేదాన్ని కాదు. మీకు చిరాకైతె నాకు చిరాకున్నర" అని వరుద్దు వరుదు అనేశాను.

"గోవిందుడొస్తాడే" అన్నారు తాపీగాఏవీ జరగనట్లు, "రానీండి" అన్నాను నేనూ మరింత నిబ్బరంగా "షటప్" అన్నారు. "సరే అలాగే కానిండి" అన్నాను. ఇంతలో మా రజక స్త్రీ యింతమోపు నెత్తి నెట్టుకుని "హ్హిహ్హిహ్హి" అని నవ్వుకుంటూ (డబ్బులడగటానికి ముందది అల్లాగే ఆర్టిఫిషియల్‌గా నవ్వుతుంది లెండి) వచ్చి సిగ్గూశరం లేకుండా మా యిద్దరి మధ్యావచ్చి నిల్చుంది. అంటే మమ్మల్ని చెరోపక్కతోసి అది అమ్మవారిలా నాలికచాపుకుంటూ నిలబడిందని కాదు అర్థం. అది వేళకాని వేళలో వొస్తుంది. వచ్చి అలాగే నిలబడుతుంది. ఎవరో ఒకరు దాని నెత్తిమీద మూటనిదించాలి. అందులో మన బట్టలువున్నా లేకపోయినా సరే మన గుమ్మం ముందు నిల్చుంటుంది కనుక మనమే ఆ మూట దింపాలి. అది రూలు! దాన్ని చూడగానే మావారు తగ్గారు. ఒక ఆడదానికి కాకపోతే మరో ఆడదానికైనా లొంగుతాడు మగవాడనడానికి ఈ స్త్రీ అనవసర ప్రవేశం ఒక ఉదాహరణ మరియు నిదర్శనం.

ఆయనకు దాన్ని చూడటమన్నా దాని నవ్వు భరించటమన్నా గొప్ప చిరాకు. దాని మొగుడికి చెప్పిదాన్ని రోజూ చితకతన్నేలా ఏర్పాట్లుచేయించాలని కూడా ఆయన మనసులో వున్నట్లు ఎక్స్‌రే కళ్ళతొచూస్తే తెలుస్తుంది. ఆయన చేతిరుమాళ్ళన్ని పోవటానికీ, బుష్‌షర్ట్ ప్యాంటు గుండీలన్నీ రాలిపోవడానికి, పిల్లల నిక్కర్లూ గౌన్లుగాయామత్ కావడానికి అదే కారణమని వారి ప్రగాఢవిశ్వాసం. అది ఇస్త్రీ చేసుకొచ్చిన మడతలన్నీవిప్పి దానిముందే పరీక్షించలేముకదా! లోపల బుజాలు చిరిగిపోయి, అక్కడక్కడ ఇస్త్రీ పెట్టిదాగులుపడి, వీపుమీద చారికలయి వుండటం కద్దు. అది వస్త్ర విరోధి ఈయావత్తు మానవజాతిమీద దానికుండుకున్న కసినంతా బండమీద బట్టల్ని బాదేప్పుడు చూపిస్తోవుంటుంది. ఇంత చేసినా దానినోట్లో నోరుపెట్టీ మనం నెగ్గలేం. అది పచ్చడి అడిగితే పచ్చడి పెట్టాలి. డబ్బులడిగితే ఎప్పటికప్పుడు ఇచ్చెయ్యాలి. లేకపోతే మనం గుడ్డలు విప్పుకునితిరగాల్సిందే అదోరకం కవుల్లాగ. అది ఎడ్వాన్స్ అడిగితే ఎడ్వాన్సివ్వాలి అస్సలది నాకొత్తజరీచీర చుట్టుకువొచ్చి దిమ్మచెక్కలాగ మనముందే నేలమీద చతికిలపడి కబుర్లు చెప్పినా మనం దాన్నేమీ అనలేం. ఇది మీచీర కాదండీ, బలేవారే అనిడబాయిస్తుంది. వాళ్ళు కట్టుకుని కట్టుకుని విడిచాకే మనంకట్టుకోవడం అని విసుక్కుంటారు మావారు. హీయీజ్‌రైట్ మనం ఓసారి ముచ్చటపడి కట్టుకున్న చీరనివాళ్లు కట్టికట్టి. అద్దెలకిచ్చి, పాతికేళ్ళు సంసారంచేసి చల్లారిపోయిన కుంపటిలావున్న ముత్తయిదువునుచేసి తీసుకొస్తారు. దాన్ని చూస్తూంటే మనకు కడుపులోంచి దేవేసినట్టుగా వుంటుంది. లైఫ్‌యీజ్‌లైక్‌దట్.

"గోవిందుడొస్తాడు" అని మళ్ళీ ఓ కూతవేసి మా వారు లోపలి కెళ్ళిపోయారు. ఇదేమి చావొచ్చిందిరా భగవంతుడా అని నేను హడలి పోయాను. ఈ గోవిందుదెవడు – ఎందుకొస్తున్నాడు! వాడికి మనకూ గల చుట్టరికం ఎలాంటిది? ఎన్నాళ్ళుంటాడు? ఏవిటి తింటాడు? ఎప్పుడు వెళ్తాడు అనే దిగులు నాకు పట్టుకుంది, ఈ మూగబాధ పడ్లేక నేనేవెళ్ళి

"గోవిందుడెవరండీ?" అనడిగా. "నాకు తెలీదే" అన్నారు మొద్దబ్బాయిలాగా. 'ఏ-గీ' అనకండి అని ఆయనమాట ఆయనకి అప్పజెపుదామనుకున్నా - కాని మనం ఆయనతో కాపురం జేయవలసినవాళ్ళం. ఆయన ఒంటికాలి మీద లేచినా మనం రెండుకాళ్ళమీదే నిలబడాలి అని కుమారీ శతకం నీతులుజ్ఞాపకం చేసుకుని, మనదేశం ఆర్థిక వ్యవస్థ చక్కబడి, స్త్రీ పురుష సమానత్వం ఏర్పడినపుడు, "ఏవే?" అంటే "ఏరా" అనొచ్చు మరీ బాగులేదనుకుంటే "ఏంవోయ్" అంటే "ఏంవోయ్" అనుకోవచ్చు అని సర్ది చెప్పుకున్నాను.

గోవిందుడెవరైనా ఆయన క్లాస్‌మేటా? లేక సాక్షాత్తు ఆ ఏడుకొండలవాడా? ఎవరికైనా అలాటి మారు పేరుందా? ఏమో ఏంచెప్ప గలం?

తరువాత ఎందుకైనా మంచిదని యిల్లంతా అక్కడిదిక్కడా యిక్కడిదక్కడా సర్ది కొంచెం చూడబుల్‌గా కొంపని తయారుచేసి మావార్ని బెల్లించి అడిగిచూశాను. పొద్దున్న "గోవిందుడొస్తాడు" అన్నారు కదా ఏవిటా గొడవ ఎవరతగాడు అన్నాను. అప్పుడాయన తొలిమంచు విడీ విడని సూర్యోదయంలా మొహం పెట్టి అన్నారు. గోవిందు డెవరో నాకూ తెలీదే నీతోడు - వస్తే వస్తాడు రాకపోతేరాడు అన్నారు. చాలా బావుందండీ అన్నా. ఆ బక్కెటో బెక్కెటో అన్నాయన జర్మనీలో ఓ నాటకం రాశాడ్ట - అందులో మావారిలాటి సోమరిపోతులే "గోడో" అనే ఒకాయన కోసం నిరీక్షిస్తూ చెట్టుకింద కూర్చుంటారట. అది రాసి నందుకు నోబెల్ బహుమతి యిచ్చారట. అది జూసి మావారు కూడా తనూ "గోవిందుడొస్తాడు" అని నాటకం రాద్దామనుకుని టైటిల్ మాత్రం సెలక్టు చేసుకున్నార్ట! బావుంది. హడిలి చచ్చానుకదండీ - యింకా ఆ గోవిందుడెవడో వస్తాడొస్తాడనుకుని నానా హైరానా పడిపోయాను. లేడీస్ అండ్ జంటిల్మెన్, మీకు గోవిందుడొస్తాడనే ఫీలింగ్ కలిగిందా లేదా-వస్తాడనే మీరూ అనుకుని వుంటారు. రానివ్వండి చితకాపతకా చింతకాయ పచ్చడి చేసేద్దాం!

# సువ్వారోపాఖ్యానం

"తాళలేనే - నే తాళలేనే

తాళలేనే ఓయమ్మా" అని పాడించేస్తున్నాయి ఈ ఎండలు - కవిత్వమొక తీరని దాహం అన్నాడుగాని కవి గుక్కుడు మంచి నీళ్ళివ్వకపోతే టక్కున చచ్చిపోయేట్లున్నాం మనం. కవులకుగాని, నాన్ కవులకుగాని ఎండల్ను భరించడం కష్టమే! కొందరు కవుల వచన కవిత్వంలాగ ఈ ఎండలు మండిపోతుంటే జరిగే పెళ్ళిళ్ళు జరిగిపోతున్నాయి. ఏం సుఖ పడుదామని ఈ ఏండల్లో వీళ్ళు తగుదునమ్మా అని పెళ్ళిళ్లు చేసుకుంటారో అర్థంకాదు. ఈ